# 'క్యూ'రియాసిటి

"అమ్మబాబోయ్ ! ఆఘమేఘాల మీద హైద్రాబాద్ వచ్చి... అంత శ్రమకోర్చి ఆస్పత్రికొస్తే ఇదా పరిస్థితి !" కార్పోరేట్ హాస్పిటల్లో కాంతికృష్ణ గొణుక్కున్నాడు. ఆస్పత్రి రాజభవనం లాగుంది. మోడ్రన్ కుర్చీల క్యూలో తనముందు ఆసీనులైన వారిని కళ్లతో లెక్కించాడు. తనది ఇరవయ్యో నంబరు.

ఈ రోజు శనివారము. రేపు ఆదివారము హాస్పిటల్‌కు హాలీడే. డాక్టర్లుందరు... కడుపులో కలకలం గిలకొట్టింది. క్రమశిక్షణ అనేది కల్లాకపటం తెలీని వారికే పరిమితమని త్రికరణశుద్ధిగా నమ్మే కాంతికృష్ణ కాకినాడ స్థిరనివాసి. సుమారో సంవత్సరం క్రితం కుడికాలుకు పుండు పుట్టింది. కొంతకాలం చిట్కా వైద్యంతో గడిచింది. పుండు గుండె బండబారిందేమో... అలాగే ఉండిపోయింది.

డాక్టరుకు చూపించాడు. ఏవేవో మందులు, ఇంజక్షన్లు... నిప్పుల మీద నీళ్ళు చల్లినట్లైంది. పదిహేను రోజుల్లో పుండు తగ్గినట్టే తగ్గి మరో ఇరవై రోజుల్లో తన ఉనికి తెలుపుతుంది. అదే డాక్టరు గారి అడిషినల్ ప్రిస్క్రిప్షన్ ... వేరే మందులు మరో కోర్సు పూర్తయింది. పుండు పూర్తిగా తగ్గిపోయిందనుకున్నాడు. కాని మొండి విత్తనంలా మళ్లీ మొలకెత్తింది. ఇహ లాభం లేదని చర్మ వ్యాధుల స్పెషలిస్టు డాక్టరు చెవులు కొరికాడు. అక్కడా అదే తంతు. డాక్టర్లు ఎందరు మారినా పుండులో మార్పులేదు సరిగదా పుండు కోతిపుండు లాగైంది.

సహనం చచ్చిపోయింది. భయం పట్టుకుంది. "సంగతేమిటో సరిగా చెప్పం" దని చర్మవ్యాధుల సూపర్ స్పెషల్ డాక్టర్ను నిలదీశాడు. ఆయన కాసేపు తటపటా యించాడు. చావుకబురు చల్లగా చెప్పినట్టు "ఎందుకైనా మంచిది, హైద్రాబాదు కెళ్లి కాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ను సంప్రదించు" మన్నాడు. కంప్యూటర్లో లెటర్ రాసి కవర్లో పెట్టి చేతికిచ్చాడు. చేతులు దులుపుకున్నాడు.

క్యాన్సర్ సోకిన మనిషి బతుకు క్యాన్సిలే... ఎప్పుడో విన్నది అప్పుడు గుర్తుకొచ్చింది. ముఖ్యమంత్రి పదవిలో ఉండి ఎమ్మెల్యే ఎలక్షన్లో డిపాజిట్ పోగొట్టు కున్నట్టనిపించింది. గుండెల్లో రాజధాని ఎక్స్‌ప్రెస్ పరుగెత్తింది. వెంటనే గోదావరి రైలెక్కేశాడు.

కాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్‌ది సూపర్ స్పెషాలిటి మనస్తత్వం. ఎంత సంపాదించినా కొంత గూడా వెంటరాదనే జ్ఞానోదయమైనప్పట్నుంచి రోజుకు ఇరవై మంది కొత్త

పేషంట్లను మాత్రమే చూస్తున్నాడు. అందుకే తెల్లవారకముందే వచ్చి రోగులు క్యూలో కూచుంటారు. డాక్టరు వచ్చే ముందు సిబ్బంది సరిగ్గా ఇరవై మందిని ఉంచేసి మిగతా వారిని పంపించి వేస్తారు.

ఉదయం గోదావరి దిగి నేరుగా కారులో నర్సింగ్ హోం చేరుకున్నాడు. తనది సరిగ్గా ఇరవయ్యో నంబరు. డాక్టరు గారొచ్చేలోగా ఏ కారణం చేతనైనా ఎవరొక్కరు మధ్యలో చేరినా తన పని హుష్కాకి. తిరిగి సోమవారం... షరా మామూలే... నేల మీద అద్దం లాగున్న పాలరాయిలో ప్రతిరూపం కన్పించి వెక్కిరించింది.

సినిమా టికెట్టు కోసం క్యూలో నుంచున్నా, తిరుపతి కొండమీద తిరుమలేశుని క్యూలో నుంచున్నా... ఏదో మాయోపాయం పన్ని ముందు కెళ్లడం అలవాటైంది. అసలు ఏ క్యూలో ఉండాలన్నా నిప్పుల మీదున్నటనిపిస్తుంది.

పుండు సలుపుతూనే ఉంది. చూపులు ముందుకు దూసుకెళ్లినై. ఏడో నెంబరు కుర్చీ ఖాళీగా ఉంది. డబుక్కున లేచి వెళ్లి గబుక్కున కూలబడ్డాడు. గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు.

డాక్టరు గారొచ్చారు. సిబ్బంది హడావుడి.

"ఇరవై నెంబరు దాకా ఉండండి. మిగితా వాళ్లు వెళ్లిపొండి" ఖచ్చితమైన సూచన జారీ అయింది.

"మిస్టర్ ! ఈ సీటు నాది. ఇప్పటిదాకా ఇక్కడే కూచున్నాను. ఇప్పుడే టాయిలెట్ కెళ్లొచ్చాను." అంటూ ఒకాయన పరుగెత్తుకొచ్చి కాంతికృష్ణను లాగేశాడు. ముందు వెనక సీట్లవారు నిజమేనన్నారు. వెంటనే ఇరవయ్యో నెంబరు కొచ్చాడు. అది ఖాళీగా లేదు. ఓ సాయెబు కూచున్నాడు. "ఇది నా సీటు... లేవాలి" అన్నాడు అథారిటీగా. సాయెబు కింది నుంచి మీద్దాకా చూసి "పోపో... నఖ్రాలు జేస్తున్నావా ?" గుర్రు మన్నాడు. బిత్తరపోయాడు. వాచ్‌మెన్ వచ్చి బయటకు లాక్కెళ్లి వదిలేశాడు.

***(జలధి - 16-2-2006)***